


## విమర్శల విషం..! నిందల నిప్పులు..!!

ఓ మిత్రమా..!
నా ప్రియ నేస్తమా..!!
కట్ట కట్టుకుని కష్టాలు
ఎన్ని క్లిష్ట పరిస్థితులొచ్చినా...
బ్రతుకు ఎంత కష్టంగా ఉన్నా
ఎన్ని అవాంతరాలొచ్చినా...
ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా...

ఎవరు ఎంతగా వ్యతిరేకించినా...
ఎంతగా వెనక్కిలాగినా...
ఎంతగా విమర్శల విషం చిమ్మినా...
ఎన్ని నిందల నిప్పులు చెరిగినా...
సింహంలా ధైర్యంగా ఎదుర్కో...

సందేహించకు...
సమస్యలు
ఎదురయ్యాయని...
సతమతమైపోకు...
వెతలకు గురికాకు...
బలహీనతలకు బలికాకు...

వెనక్కి తిరిగి చూడకు...
వేదన చెందకు...
ఎవరిని
నిందించకు...

నిట్టూర్చకు...
నిరాశ పడకు...
అనుకున్న లక్ష్యాన్ని...
ఖచ్చితంగా సాధిస్తానన్న
దృఢనమ్మకాన్ని వదులుకోకు...

విజయం ముందు చింతల
చితిమంటల చిటపటలే...
అన్ని ఇక్కట్లే చిమ్మ చీకట్లే...
ఆ పై మ్రోగేది వేలాది చప్పట్లే...
కప్పేది సత్కారాల జరీ దుప్పట్లే...
నీ సాహసం నీ పట్టుదల నీ కసి నీకృషి
గురించి నీ ముందు వెనుక ముచ్చట్లే...

రచన:
కవి రత్న
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

## బాల గేయం :

"మ"గుణింత బాలగేయం

## మదిలో మంచిని పెంచాలి

పల్లవి :మదిలో మంచిని పెంచాలి
మందిని ఎపుడూ గెలవాలి.......
"మదిలో "
మ -మదిలోమంచినిపెంచాలి
మా -మానవత్వమునే పంచాలి
మి -మిహిరుడ నీవై వెలగాలి
మీ -మీనకేతుడవైమురిపెముగనుండాలి ..
"మదిలో "

ము -ముద్దామురిపెం హద్దుగ నుండాలి
మూ -మూలమూలలా శోధన చేయాలి
మృ -మృదుమధురిమ భాషణ చేయాలి
మృ - మృగధరుడిలా జీవనం సాగించాలి ...
"మదిలో "

మె -మెరుపు వేగమై మనసుండాలి
మే -మేనుకుఎపుడూమెరుగులు దిద్దాలి
మై - మైదానంలో ఆటలు బాగా ఆడాలి
మొ- మొద్దు నిద్దురని విడవాలి..... "మదిలో "

మో- మోహారమువలె సాధనచేయాలి
మౌ- మౌక్తికమువోలే మనసుమెరవాలి
మం-మందిలోఎపుడూ గొప్పగనుండి న
మః - మః శివాయంటూ
మనమునకొలవాలి.."మదిలో "

డాక్టర్.కవికోకిల కొఠారి వెంకటరత్నం.
విశ్రాంతఉపాధ్యాయులు. కవి, రచయిత.
9000169823.వి. కోట. చిత్తూరు జిల్లా.





## అమ్మేగదా! మన స్వర్గం...

అఆ, ఇఈ, ఓనమాలు
అమ్మ ఒడియే తొలి బడి
ఉగ్గుపాల విద్య, బుద్ధి
అమ్మేగదా! నేర్పిన పాఠం...

అమ్మ కొంగు రామరక్ష
అమ్మ చండీ, దుర్గా, కాళీ
అమ్మ లక్ష్మి, సరస్వతీ
అమ్మేగదా! భువిపై దైవం...

అమ్మభాష మాతృ భాష
అమ్మే గదా! తొలి గురువు
ఈశ్వరుని బహుమానం
అమ్మేగదా! మన స్వర్గం...

అవతారుల, ప్రేషితుల
అమ్మే గదా! జన్మధాత్రి
అమ్మ ప్రేమ మహాభాగ్యం
అమ్మేగదా! వరదానం...

రాతిని శిల్పం చేయు
అమ్మయొక్క సంస్కారం
అమ్మకు శత వందనాలు
అమ్మంటే నాప్రాణం...

డా. మొహమ్మద్ షకీల్ తాజ్ మొహమ్మద్ జాఫరీ, మంచర్ (పూణే) మహారాష్ట్ర, భారత్

## ఉగ్రవాదం మానవ మనుగడకు ప్రమాదం



ఉగ్రవాదం అనే అగ్ని,
శాంతిని కరిగించే,
బాంబుల శబ్దంలో
బాలల నవ్వులే మాయం.

రక్తపు చెరువులోని ప్రతీ అడుగు,
భయానక కథలతో నిండిన దారి.
ప్రేమను పిండే ప్రళయ రూపం,
ప్రజల గుండెల్లో తలచే వేదన.

ఇది మతానికీ జాతికీ శత్రువు,
ఇది మానవతకు ఎదురైన శకం.
గుడులు గూడులు అన్నదే లేదు,
వేడుకల పక్కనే విలాపం వినిపించె.

నిధులు కాదు, నిజమైన శాంతి కావాలి,
రావాలి భద్రత, రావాలి న్యాయం.
విద్వేషపు విత్తనాలు నశించాలి,
మనసుల మధురత మళ్లీ పుట్టాలి.

మనసుల మాటలే ఆయుధాలు కావాలి,
మానవత్వమే ఆయుధంగా మారాలి.

పాల. కుమారస్వామి (రవి)
ప్రైవేట్ స్కూల్ తెలుగు టీచర్
వరంగల్



## తెలుగు తేజం

ఓంకార నాదమై తెలుగు భాష ఉద్భవించిన వేళ,
మధుర ఆలాపనలో శృతిలయలు పలుకు మేళ?
నా తెలుగు భాష నా ప్రాణానికి తోడైన ఆశ,
నవరస స్వరాలతో ప్రవహించు నా శ్వాస?

తేట తెలుగు ఉచ్చారణతో
పలికితే చిలుకను తీయగా తేనె జల్లు,
చిన్నదై మాటల వడగండ్ల వానయై
చల్లదనంతో నింపును మనసు మల్లు?
ఊరును గానమై ఉప్పొంగి గలగల పొంగి,
పారును నదమై %-% నారద బ్రహ్మ వాద్యమై
సంద్రమున చేరి నిలుచును సాంద్రమై?

గంభీర పదమున భావ ఝరి,
పరిమళాల ప్రతిభలు వెదజల్లును జ్ఞానమై,
ధర్మమై నడిపించే దీక్షయై,
సత్య సమాన అక్షరమై?
మనసున పూచే విశ్వ స్వరూపమై,
మహాన్విత వాణియై,
తెలుగు మాటే జీవితదీపమై %-% జీవనానికి ప్రాణప్రదమై?

పల్లె పాటల చరణ శ్రుతులై,
పైరగాలులలో కమ్మని మట్టి సువాసనలై,
రైతు గొంతు రాగమై వానలు కురిపించు యాగమై,
కొడవలి మాదిరి కోటయ్య జానపద గేయమై,
ఆడిపాడెను పల్లె %-% పల్లవి లోగిలిలో
తృప్తి నిండిన పరవశమై?

పోతన పద పదమున పరిమళమై,
భక్తిభావ రంజకమై,
వేమన శతకాలు నేర్పిన సత్యసార స్వరూపమై,
కేశవశతక పంక్తుల గీతకావ్యమై?
తెలంగాణ సినారె, దాసరథి శాసనమై,
చంద్ర బోస్, సుద్దాల, అందెశ్రీ, గోలేటి,
గద్దర్ తదితరుల చేతివాటమై,
కావ్యగమనాన క్రొత్త పుంతలు తొడిగింది %-% సాహిత్యమై?


గోదావరి గలగలల తరంగముల వలె
గుండెలోన మ్రోగిన మ్రోతయై,
కృష్ణమ్మ ఒలికి పలికిన సుస్వరమై,
పల్లెల హైలెస్సా పాటయై,
మంజీర తేట చిందుల నృత్యధ్వనుల మధుర శబ్దకలయకయై,
నదుల నాదమై తరంగిణుల తాళలయ ఊటయై?

భద్రాద్రి రామునికి పరవశమైన పవన వీచికల భక్తిగోష్ఠయై,
యాదగిరి నరసింహుని కొని యాడిన దివ్యగాన అష్టకమై,
కాళేశ్వర క్షేత్రము కలియుగ త్రివేణి తీర్థ ప్రసాదమై,
వేములవాడ విరాట్ శివుని విభూతుల సౌందర్యశోభయై?

తల్లి కరుణ స్పర్శలో ప్రాణానికి విరబూసిన రాగం?
తన కంటి చూపుతో మాటలే మౌన మాయాజాలం,
పాప కన్నుల సైగలలో అమ్మ పలికిన ప్రేమ భాష్యం కవితావిలాసం?
అమ్మ లాలి పాటలో తెలుగు పలికే పలుకులు ఔతాయి పసికూనకు లేపనం?

రచన బిటవరం శ్రీమన్నారాయణ ఎలుకుర్తి హవేలి వరంగల్.

## నా స్వేచ్ఛాజీవితం



శరీరానికి
లోపాలులేనివాడిని
అవయవాలను
పూర్తిగా ఉపయోగించుకుంటా

చేతికి
బేడీలులేనివాడినిజి
చేయాలనుకున్నది చేస్తా
సక్రమంగా నడచుకుంటా

కళ్ళకి
గంతలులేనివాడిని
నిజాలను చూస్తా
నిర్భయంగా మసలుకుంటా

నోటికి
తాళాలులేనివాడిని
చెప్పాలనుకున్నది చెబుతా
తేనెచుక్కలు చల్లుతా

చెవులనుజి
మూసుకునేవాడినికానుజి
పిలిస్తే పలుకుతా
కోరితే సహకరిస్తా

కాళ్ళకు
బంధాలులేనివాడిని
కావలసినచోటుకు వెళ్తా
కార్యాలు కరాఖండీగాచేస్తా


ఆలోచనలపై
అవరోధాలుపెట్టనివాడిని
లోతులలోకి వెళ్తా
ఉన్నతభావాలు వెలువరిస్తా

మనసుపై
ఆంక్షలులేనివాడిని
ఊహలను ఊరిస్తా
మేధోమదనం చేస్తా

కాలంపై
కాపలాలేనివాడి
కోరినట్లు వాడుకుంటా
గమ్యాలను చేరుకుంటా

స్వేఛ్ఛజి
నా ఆయుధం
సేవజి
నా ధ్యేయం

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం




## "మాతృ గ్రాముస్తుతి"

సీ/ "శ్రీరామ లింగేశ, శ్రీరంగ
నాయక
మాత భవాని సమేత లింగ!
శ్రీదేవి, భూదేవి శేషశాయిని
గొల్వ
హరిహరాదు లిచట ఐక్య మైరి
జగదీశునకు తోడు జనయిత్రు
లిద్దరు
విలసిల్లి పతులతో వెలసి
నారు!
పురజనులకు దివ్య పుణ్య
క్షేత్రము కాన
కనికరిస్తు జయాలు కలుగ
జేయు"!
ఆ.వె/
"ధైర్య సాహ సాల ధర్మ నిరతి
గల్గి
కలిమి యోర్మ లందు చెలిమి
గల్గి
భక్త జనుల బ్రోచు పాలవెల్లిని
బోలు
"మొగలి గిద్ద ముగ్ధ మోహ
నాంగి"!!

దయానందం కోట్ల
రిటైర్డ్ టీచర్
షాద్ నగర్
జిల్లాబీ-రంగారెడ్డి

-----------



## ఇప్పుడు యుద్ధము ఎందులకో

వారి నేల వధించవలయును
వారి యుచ్చున పడుట యెందుకు
పారె బిలమున నెలుక నొడుపుగ
కారు పొగతో కప్పివేయుము

రెండుపిల్లుల రొట్టెగొట్టిన
మొండికోతికి మొండిచెయ్యిడి
ఖండితమ్ముగ గుండెబిగవున
మండురోషపు టెండజూపుము

చెట్టుగూల్చగ చెట్టనొంచగ
తొట్టతొలుతను వ్రేళ్ళనరకుము
కట్టెదురనే కాల్చి చంపిన
చెట్టకడుపున చిచ్చుబెట్టుము

నీళులాపుము కూళకడుపులు
గాల దిగ్బంధముల మసలుము
గోలగాండ్లకు కూటతంత్రపు
జాలమీగగ లీలజూపుము

ఇంటివారలు బయటివారలు
కంటికుంపటి రగులజేతురు
బంటువలె బద్మాషు నక్కలు
నొంటె గాడ్దెల నొవ్వజేతురు

అన్నదమ్ముల నడ్డుపెట్టుకు
మిన్నుమన్నుల కలచివేతురు
అన్న మేమున్నా మటంచును
నిన్ను నొంటరి జేయజూతురు

రెచ్చగొడుదురు రచ్చజేతురు
లుచ్చలొకటై పెచ్చరిలుదురు
పచ్చికను మండించి పశువుల
వెచ్చమూడ్తురు విచారించుము

కుట్రచక్రము కూల్చివేయుము
రోతకలహము లూడ్చివేయుము
వాతబెట్టుము పాతరేయుము
నేర్పుగుణపాఠమును నేర్పన

ఆర్థికప్రగతి అస్థిరపరచ
వ్యర్థ ఋణాల పైకెగరేయ
ఎగుమతినొంచి దిగుమతిపెంచ
ధరలుసమస్యలు తాండవమాడ

తలసరి ఆదాయమ్మును త్రుంచ
కలిమి నిల్వలను కాటువేయగ
ఇల నసమానత లెగదోయంగ
కెలుకుట కుమ్ముట కేలతొందర

పసిడి కైనను కాలి కరుగక
వెసను నలుగక దెబ్బ దినకను
అసలాభరణముగా నగునె
కసిని జూపక కాటువేయుము

భారతావని పద్మవ్యూహపు
దారిబడ దుర్మార్గ యత్నము
ఘోరశాపము ద్రౌణికిని వలె
పరాగమము పరిష్కారమగు

రచన:: శంకర్ జీ డబ్బికార్
ఊరు::ఇబ్రాహీంపట్నం

## మీ సేవలు మరువలేము..!




వైద్య రంగంలో
రోగులకు సేవలు చేస్తూ
జాగ్రత్తగా చూసుకుంటూ
కంటికి రెప్పలా కాపాడుతూ
మానసిక ధైర్యం చెబుతూ
అండగా నిలిచే
ఆప్తులు నర్స్.
సేవలు అందించుటలో
రోగిని రక్షించుటలో
వ్యాధి తగ్గించుటలో
ఆరోగ్యం పెంచుటలో
వారి పాత్ర అమృతమే
వారి కష్టం ప్రశంసనీయమే.
ఆసుపత్రి నిర్వహణలో
వ్యాధుల నిర్మూలనలో
ప్రజలకు సౌకర్యాలు అందించుటలో
తమకు తామే సాటి
లేదు పోటీ.

యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం



